
జనగామ మండలం యశ్వంతాపూర్ వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన బస్సు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు

ఘోర ప్రమాదం తప్పిన పెను ముప్పు

ఒకరికి తీవ్రంగా, 19 మందికి స్వల్ప గాయాలు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని యశ్వంతాపూర్ పరిధి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, 19 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి వరంగల్‌కు బయల్దేరిన ఓ ప్రైవేటు ట్రావెల్ సంస్థకు చెందిన లగ్జరీ బస్సులో 20 మంది ప్రయాణికులున్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్-నిడిగొండ గ్రామాల మధ్య బస్సు రాగానే ముందు టైరు పేలడంతో ప్రమాదం జరిగింది. అందులో ఉన్న జయశంకర్ భూపాలపల్లికి చెందిన పోషయ్యకు చేయి పూర్తిగా విరిగి నుజ్జు నుజ్జయింది.

హాహాకారాలతో దద్దరిల్లిన ఘటన స్థలి..

బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కి బోల్తా పడింది. ఈ హఠాత్పరిణామంతో ప్రయాణికుల హాహాకారాలు దద్దరిల్లాయి. ఏం జరిగిందో అర్థమయ్యే లోపు బస్సులోనే ఒకరిపై మరొకరు పడిపోయారు. గమనించిన వాహనదారులు వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడకు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. ఘటన స్థలిని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, సీఐ దామోదర్‌రెడ్డి పర్యవేక్షించారు. బస్సు రహదారికి అడ్డుగా పడటంతో దాదాపు రెండు కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పక్కకు జరిపించి రాకపోకలను పునరుద్ధరించారు. జరిగింది పెద్ద ప్రమాదమే అయినా ఎలాంటి ప్రాణ నష్టం చోటు చేసుకోకపోవడంతో ప్రయాణికులు, పోలీసులు, స్థానికులు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. పోషణ మాసంను పురస్కరించుకుని సోమవారం జనగామ మండలం శామీర్‌పేటలోని ఓ వేడుకల మందిరంలో జిల్లా సంక్షేమ జనగామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి డీడబ్ల్యూఓ, జయంతి అధ్యక్షత వహించగా.. పాలనాధికారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు మాసంలో పోషణ మాసాన్ని ఘనంగా నిర్వహించామని, ఇందులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్షిత ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించామన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసిని, డీఎంహెచ్‌వో రవీందర్, జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, సీడీపీవో రమాదేవి, సఖి కేంద్రం సీఏ రేణుక, ఐసీడీఎస్ బృందాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అధికారులు

యూఏఈలో ఉద్యోగ అవకాశాలు

కొత్తవాడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ సంస్థ యూఏఈలో బైక్ రైడర్స్ ఉద్యోగాలు ఉన్నాయని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. యూఏఈ(దుబాయ్)లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు టామ్‌కామ్ పోర్టల్‌లో ఈ నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం లైసెన్స్, 21 ఏళ్లు నిండిన యువకులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 94400 51285 సంప్రదించాలన్నారు.

మక్కలిలా.. దారి మళ్లేదెలా!



పాలకుర్తి మండలంలోని శాతాపురం శివారులో రహదారులపైనే మక్కలు ఆరబెడుతుండటంతో ప్రయాణికులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రిళ్లు ఈ కుప్పల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. రైతులు కల్లాలని వాడుకోవాలని, రోడ్డుపై పోయడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాలకుర్తి



కష్టేఫలి..!

డీఎస్సీలో మెరిశారు.. అనుకున్నది సాధించారు!

'డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ఉంటుంది. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు జనగామలోని ప్రెస్టన్ పాఠశాలలో సంప్రదించాలి'

న్యూస్‌టుడే యంత్రాంగం

కల నెరవేరింది.. కష్టానికి ఫలితం దక్కింది. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా వీరు ఎదురుచూశారు. ఇతర అవకాశాలు ఉన్నా కాదనుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దీక్షగా చదివి చివరికి అనుకున్నది సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో సబ్జెక్టుల వారీగా జిల్లాల్లో మొదటి, రెండో ర్యాంకులు సాధించిన వారి స్ఫూర్తిదాయక కథనం..

మూడో ప్రయత్నంలో


రజనీకాంత్

జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వడ్డిచర్లకు చెందిన బెహరా రజనీకాంత్ స్కూల్ అసిస్టెంటు ఫిజికల్ సైన్స్ విభాగంలో జిల్లాలో రెండు పోస్టులకు గాను 71.57 మార్కులతో అగ్రస్థానంలో నిలిచి ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇదివరకు రెండు సార్లు దూరమయ్యారు. జనగామలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో లెక్చరర్‌గా పనిచేశారు. – జనగామ అర్బన్


నిడిగంటి సునీల్

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన నిడిగంటి సునీల్ స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రంలో 77.83 మార్కులు సాధించి మహబూబాబాద్ జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారు. సునీల్ ప్రస్తుతం మహాత్మా జ్యోతిబా పులే సంక్షేమ గురుకుల పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నాడు. – ఇనుగుర్తి

☛ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాకు చెందిన గుగులోతు నిఖిల్ స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో జిల్లా ప్రథమర్యాంక్ సాధించారు. ప్రస్తుతం పెద్దవంగర మహాత్మాజ్యోతిబాపులే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. – తొర్రూరు

ఒకేసారి మూడు ఉద్యోగాలు..


మామిడి మహేశ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ మూడు ఉద్యోగాలు సాధించి మురిపించారు. తెలుగు పండిట్ విభాగంలో 80.90 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 76.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంకు సాధించారు. మహేశ్ ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సమ్మయ్య, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహంతో మంచి ఫలితం సాధించేందుకు కారణమైందని ఆయన చెప్పారు. – చిట్యాల

పీడీ, పీఈటీ సైతం..


నేతుల రాజు

వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నేతుల రాజు డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. – సంగెం

ఉద్యోగం చేస్తూనే..


శివరాజ్ బాలాజీ

జనగామ జిల్లా కేంద్రంలోని పాతబీటు బజారుకు చెందిన శివరాజ్ బాలాజీగోగికర్. ఉన్నత చదువుల అనంతరం ప్రైవేటు విద్యాసంస్థల్లో పాఠాలు బోధిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ముందుకు సాగాడు. లాంగ్వేజ్ పండిటు హిందీ విభాగంలో ఓపెన్ కేటగిరిలో 60.77 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని కరుణాపురం ఎంజేపీ గురుకులంలో హిందీ ఉద్యోగిగా సేవలందిస్తున్నారు. – జనగామ అర్బన్

ఐదో సారికి..


ఎండీ ఫర్జాన

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం మడ్తపల్లి గ్రామానికి చెందిన జంగిలి రాజేందర్ గణిత విభాగంలో 75.30 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. 2008 ఏడాదిలో డీఎస్సీ, 2012, 2017, 2023లో గురుకుల పోస్టుల కోసం పరీక్షలు రాయగా అతి తక్కువ మార్కుల తేడాతో ఉద్యోగాలను కోల్పోయారు. నిరాశ చెందకుండా ప్రణాళిక ప్రకారం చదువుతూ ఐదో ప్రయత్నంలో ఉద్యోగం సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. – రేగొండ


ఎండీ ఫర్జాన

● వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జాన స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 65.67 మార్కులు సాధించారు. సిద్ధిపేట జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. రెండు నెలల క్రితం హిందీ విభాగంలో జేఎల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. – దుగ్గొండి

ఉద్యోగం వదులుకొని..


శ్వేత

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎలగందుల శ్వేత మొదటి ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం హనుమకొండ వికాస్‌నగర్‌లో ఉంటున్న ఆమె బీఎస్సీ, డీఈడీ చదివారు. ఎస్జీటీ విభాగంలో 100 మార్కులకు గాను 83.37 మార్కులు సాధించారు. గతంలో నల్లబెల్లి మండలంలో పంచాయితీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన ఆమె.. ఆ ఉద్యోగం వదులుకొని ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఆసక్తితో డీఎస్సీ రాశారు. భర్త శ్రీకాంత్ ఎస్సైగా పనిచేస్తున్నారు. – రంగశాయిపేట, ఖానాపురం

కష్టాలు ఎదుర్కొని..


గడ్డం ఫణీంద్ర

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒడిపిలవంచ గ్రామానికి చెందిన గడ్డం ఫణిందర్ జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వైకుంఠం ఏడాది కిందట మృతి చెందగా తల్లి పద్మ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగానికి సెలవుపెట్టి పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకు సాధించాడు. గ్రూప్-4లోనూ జిల్లాలో 13వ ర్యాంకు తెచ్చుకున్నారు. – కాటారం


మేడి నాగరాజు

నెక్కొండ: నెక్కొండకు చెందిన మేడి నాగరాజు డీఎస్సీ (తెలుగు లాంగ్వేజ్ పండిట్)లో మహబూబాబాద్ జిల్లాలో 70.17 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు.

మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తా

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఓ వేడుక మందిరంలో ఐసీడీఎస్ అధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోషణ్ అభియాన్ పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక 18 ఏళ్లు నిండక ముందే వివాహాలు చేయడంతో చిన్న వయసులోనే గర్భం దాల్చడంతో అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఎంపీ డా.కావ్య మాట్లాడుతూ.. మహిళా సాధికారత అంటే ఆర్థికంగా ఎదగడం కాదని, ఆరోగ్యంగా వృద్ధి చెందాలని తెలిపారు. ప్రతి మహిళ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఎంపీడీవో విజయశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీడీపీవో ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి. చిత్రంలో ఎంపీ కావ్య

లింగాలఘనపురం.. విగ్రహాలు ఘనం

లింగాలఘనపురం పేరును సార్థకం చేస్తూ గ్రామంలో విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ప్రస్తుతం శిథిలమైన ఇందిరమ్మ విగ్రహంతో మొదలై ఆదివారం చేపట్టిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణతో 12కు చేరడం విశేషం. భారత రాజ్యాంగ రచయిత అంబేడ్కర్, సాయుధ పోరాట యోధులు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, రాజ్యాధికార సమరయోధుడు సర్వాయి పాపన్న, లింగాలఘనపురం మండల కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన దివంగత ఎమ్మెల్యే రొండ్ల లక్ష్మారెడ్డి విగ్రహాలు తహసీల్దార్ కార్యాలయం ప్రహరీ వద్ద కొలువుదీరాయి. గ్రామంలోకి అడుగు పెడుతూనే దివంగత ప్రధాని అటల్‌బిహారీ వాజపేయీ, తెలంగాణ తల్లి విగ్రహాలు కనిపిస్తాయి. గ్రామం మధ్యలో గాంధీజీ విగ్రహం, ఉన్నత పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద, దివంగత ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, సరస్వతీ మాతా విగ్రహం మండల ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయి. లింగాల ఘనపురంను ఇప్పుడు విగ్రహాల ఘనపురం అని పిలిస్తే అతిశయోక్తి ఏమీ లేదు. – న్యూస్‌టుడే, లింగాలఘనపురం


కూడలిలో వరుసగా ఐలమ్మ, కొమురయ్య, పాపన్న, లక్ష్మారెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలు

ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం-19 ద్వారా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో సంబంధిత అధికారులను సంప్రదించి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

ఏసీపీ కార్యాలయం తనిఖీ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: వార్షిక తనిఖీల్లో భాగంగా జనగామ పోలీసు డివిజనల్ కార్యాలయాన్ని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా సోమవారం సందర్శించారు. ఈ మేరకు డీసీపీ రాజమహేంద్రనాయక్, పోలీసు అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయాన్ని సీపీ తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, నేరస్తుల అరెస్టు, కేసుల దర్యాప్తు స్థితిగతులపై ఏసీపీ పార్థసారథిని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మెరుగుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదుల నిరసన

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: న్యాయవాదుల(అడ్వకేట్) సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం జనగామ కోర్టు ముందు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి మాట్లాడారు. న్యాయవాదుల రక్షణ చట్టం, అమెండ్‌మెంట్, టెన్యూర్ పీపీల నియామకం పాత పద్ధతిలో నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నక్క సిద్దులు, లక్ష్మణస్వామి, మంచాల రవీందర్, సత్తయ్య, ఎల్లారెడ్డి, శంకర్, సంగీత, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.




ఏడు దశాబ్దాలైనా నెరవేరని అంబేడ్కర్ పార్కు..

దిశ మారేనా.. దశ తిరిగేనా..

నేడు జనగామ పురపాలిక ఆవిర్భావ దినోత్సవం

జనగామ, న్యూస్‌టుడే: జనగామ పురపాలిక చరిత్రలో మరో మైలురాయి. రాజుల పాలన నుంచి ప్రజాపాలన వరకు అపూర్వ చరిత్ర ఈ పట్టణం సొంతం. స్థానిక పాలనా పరంగా చూస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ కార్పొరేషన్ మినహాయిస్తే, ఒకే ఒక పురపాలక సంఘంగా వెలుగులీనింది. 1953 అక్టోబరు ఒకటిన జనగామ మూడవ శ్రేణి మున్సిపాల్టీగా రూపుదిద్దుకుంది. ఆటుపోట్ల నడుమ నగరపంచాయతీగా ఓ మెట్టు దిగి, 2010లో ద్వితీయ శ్రేణి పురపాలికగా ఎదిగింది. నేడు(మంగళవారం) ఏడు పదులు దాటి 71వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ ప్రత్యేక కథనం..

అ'పూర్వ'ం.. ఘనం..

జనగామ జైనుల ప్రాబల్యంలో, కళ్యాణి చాళుక్యులు, నాయకరాజులు, కాకతీయుల నుంచి అసఫ్‌జాహిల దాకా పాలనా కేంద్రంగా ఉంది. చారిత్రక ఆధారాల ప్రకారం ఇది కళ్యాణి చాళుక్యుల రెండో రాజధాని. అసఫ్‌జాహి వంశ కాలం మ్యాపులను అనుసరించి దీని పేరు ఝునగాం. 1854 వరకు భువనగిరి సర్కార్ పరిధిలో ఉండగా, 1866లో జరిగిన విభజనలో ఓరుగల్లులో భాగమైంది. హైదారబాద్ రాష్ట్ర విభజన సందర్భంగా, జనగామ తాలూకా తిరిగి నల్గొండ జిల్లాలో చేరింది. అక్టోబరు ఒకటి 1953లో పునర్విభజన ప్రక్రియలో జనగామను వరంగల్‌లో చేర్చారు. ఇదే రోజున జనగామ పురపాలక సంఘం ఏర్పడిందని సమాచారం. ప్రగతిపరంగా చూస్తే ఏడు దశాబ్దాల కాలం అమూల్యమైంది. పట్టణం ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చెందాలంటే అన్ని వర్గాల ఆలోచన దిశ మారితే దశ తిరుగుతుంది.

ఎందరో నేతలు..

1953 నుంచి 2020 వరకు తొమ్మిది పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. మొదటి కౌన్సిల్‌కు కాంగ్రెస్‌కు చెందిన కోడూరు జగన్నాథరెడ్డి, ఆయన రాజీనామాతో దిడిగం రాజలింగం ఛైర్మన్లుగా సేవలందించారు. రెండో ఎన్నికల్లో రాగిన ర్సింలు ఏడాది, ఆపైన రెండు పర్యాయాలు వెన్నం వెంకటనర్సింహారెడ్డి పాలకవర్గ అధ్యక్షులుగా వ్యవహరించారు. 2014 స్వరాష్ట్రంలో భారాస నుంచి గాడిపల్లి ప్రేమలతారెడ్డి తొలి మహిళా ఛైర్‌పర్సన్‌గా, 2020 ఎన్నికల్లో అదే పార్టీకి చెందిన పోకల జమున అధ్యక్షురాలయ్యారు.

1951లో జనాభా- 11259,
2011 లెక్క ప్రకారం- 52394.
1953లో బడ్జెట్- రూ.1.50 లక్షలు.
2023-24 అంచనా బడ్జెట్- రూ.20.07 కోట్లు
2024-25 అంచనా బడ్జెట్- రూ.27.43 కోట్లు

సాధించిందీ.. సాధించాల్సిందీ ఉంది..

2013లో పొన్నాల లక్ష్మయ్య హయాంలో రూ.20.23 కోట్లతో తాగునీటి సరఫరా పథకం మంజూరైంది. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో రోజు నీటి సరఫరా జరిగే పురపాలికగా ప్రసిద్ధి పొందింది. రూ.17 కోట్లతో రోడ్లు, కాల్వలు, సామాజిక భవనాలను పెద్ద ఎత్తున నిర్మించారు. 2017లో ఎమ్మెల్యే యాదగిరి రెడ్డి హయాంలో పట్టణ సుందరీకరణకు రూ.30, రూ.9.10 కోట్ల ప్రత్యేక పథకాలు మంజూరయ్యాయి. శాసనసభ ఎన్నికలయ్యాక రూ.25 కోట్ల పథకం మంజూరైనా, ఆచరణలోకి రాలేదు. అలాగే 70 ఏళ్లు గడిచినా పట్టణంలో బాలలకోసం అన్ని హంగులతో కూడిన పార్కు, ఇండోర్‌స్టేడియం, రంగప్పచెరువు సుందరీకరణ, భూగర్భ డ్రైనేజీ పథకం ప్రతిపాదనలోనే ఉన్నాయి. మున్సిపల్ ఆస్తులు, స్థలాలు తరిగిపోతున్న తీరును సమీక్షించాలి. చెంతనే గోదావరి జలాలున్నా, పట్టణ వాసులు ఏటా రూ.4 కోట్ల విలువైన తాగునీరు కొంటున్నారు. పౌరసేవల హక్కులే కాదు, పట్టణాభివృద్ధిలో పౌరబాధ్యతను ప్రజలు గుర్తించాల్సిన తరుణమిది.

అందరి బాధ్యత



పురపాలన సవ్యంగా సాగాలంటే, పాలకవర్గంతో పాటు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రణాళిక బద్ధమైన, ఆదర్శ వంతమైన పాలనకు కంకణ బద్ధులు కావాలి. అందరికీ శుభాకాంక్షలు.. అన్నారు 98 ఏళ్ల వయసులోనూ గతాన్ని విస్మరించని సుదీర్ఘకాలం పాలించిన మాజీ ఛైర్మన్ వెన్నం వెంకటనర్సింహారెడ్డి.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ



70 ఏళ్ల పురపాలిక పరిధిలో అభివృద్ధి ఎంతో జరిగింది. ఇది నిరంతర ప్రక్రియ. మొదటి శ్రేణి మున్సిపాల్టీగా రూపుదిద్దుకోవడానికి అన్ని హంగులున్నాయి. దీనిపై దృష్టిసారించాల్సి ఉందన్నారు ప్రస్తుత ఛైర్‌పర్సన్ పి.జమున.

పోషణ చట్టం.. వృద్ధులకు పట్టం

పిల్లలను పెంచి.. పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు.. దీంతో ముదిమి వయసులో క్షోభ అనుభవిస్తున్నారు.. బతుకుమార్గం చూపిన అమ్మానాన్నలను కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బిడ్డ పైన ఉంది.. చట్టపరంగా వృద్ధులకు హక్కులు ఉన్నాయి.. నిరాదరణకు గురవుతున్న సందర్భాల్లో న్యాయస్థానాలు అండగా ఉంటున్నాయి.. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం.

‘వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 14567 నంబరును సంప్రదించాలి.’

న్యూస్‌టుడే- హనుమకొండ కలెక్టరేట్, గిర్మాజీపేట, ములుగు



రైతు బంధు, కౌలు డబ్బులు వచ్చేలా చేశారు

ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన ఈయన పేరు మామిడిశెట్టి చిన్న మల్లయ్య. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి ఇళ్ల స్థలాలు, భూములు పంచి ఎకరం భూమిని తమ పోషణ నిమిత్తం ఉంచుకున్నారు. ఆ భూమి పొరపాటున పెద్ద కొడుకు రాజు పేరున పాసుబుక్‌లో నమోదైంది. దీంతో రైతుబంధు పెద్దకుమారుడికి వెళుతోంది. తండ్రి తన పోషణ నిమిత్తం ఉంచుకున్న భూమిని చిన్న కుమారుడు కౌలుకు చేస్తూ కౌలు డబ్బులు తండ్రికి ఇవ్వడం లేదు. దీంతో మామిడిశెట్టి మల్లయ్య ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఇరు వర్గాల వాదనలు విన్న ఆర్డీవో మల్లయ్య భూమి ఆర్డీవో పేరిట నమోదు చేయాలని సెప్టెంబరు 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రైతు బంధు, కౌలు డబ్బులు ఆర్జీదారుకు చెందేలా మార్గం సుగమమైంది.

ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలి




వెంకటాపురం మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గోశిక సమ్మక్కకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా హనుమకొండలో ఉంటున్నారు. ఊళ్లో ఆయనకు పంచి ఇచ్చిన ఇంట్లో సమ్మక్క నివాసం ఉంటోంది. చిన్న కొడుకు మరణించిన తర్వాత కోడలు ఆ ఇంట్లో సమ్మక్కను ఉండనివ్వడం లేదు. పెద్ద కుమారుని వాటా కూడా తమకే చెందుతుందని గొడవ పడింది. దీంతో వేరే ఇంట్లో నివాసం ఉంటున్నానని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరువురికి నోటీసులు జారీ చేశారు. వాదనలు విన్న అనంతరం పెద్ద కుమారుడి వాటాగా ఉన్న ఇంటిలో సమ్మక్క నివాసం ఉండేలా, ఆమె జీవనానికి పెద్ద కుమారుడు రవిందర్, చిన్న కోడలు శ్రీలత నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆదేశిస్తూ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు.

అండగా చట్టాలు..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి.. హిందూ దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయ స్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం- 2007ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

దరఖాస్తు ఎవరికి సమర్పించాలి..?

వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో.. ఇంతకుముందు చివరిసారిగా ఎక్కడ నివసించారో తెలుపుతూ వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో.. తెలుపుతూ ఆయా జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(మెయింటనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమాధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.



90 రోజుల్లో విచారణ

వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రైబ్యునల్ పిల్లలకు నోటీసులు పంపించి విచారణాధికారులచే వాదనలు, సాక్ష్యాలు సేకరించి పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది.. మూడు నెలల పాటు సదరు పిల్లలు పోషణ ఖర్చులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు. ఉత్తర్వులు పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది.

☛ నడవలేని వయోవృద్ధులకు వీల్‌చైర్స్, చేతి కర్రలు, ఇతర పరికరాలు, వినికిడి యంత్రాలు, కళ్లజోడులు అందజేస్తారు. వృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే.. పిల్లలతో ఇబ్బందులు ఎదురైతే జిల్లా సంక్షేమాధికార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారిణి రాజమణి తెలిపారు.

ఆశ్రమాల్లో ఆదరణ..

నిరాదరణకు గురైన వృద్ధులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనాథాశ్రమాల్లో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వృద్ధాశ్రమాలు ఉండగా అందులో సుమారు 474 మంది ఉంటున్నారు.


జిల్లా	ఆశ్రమాలు	వృద్ధుల సంఖ్య
హనుమకొండ	10	252
వరంగల్	05	154
జనగామ	02	30
మహబూబాబాద్	01	12
భూపాలపల్లి	01	10
ములుగు	01	16



నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

-తేరాల యుగంధర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కార్యదర్శి



2018లో మేం వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. మా పోరాటం వల్లే ఎంజీఎం ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశారు.



టోల్‌ఫ్రీ నంబరుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

కనీసం తిండి పెట్టకుండా..



స్టాండు సాయంతో మెట్లు దిగుతున్న ఈ వృద్ధుడి పేరు వెల్పుల నర్సయ్య వయసు 90 ఏళ్లు.. సంగెం మండలం గవిచర్ల నివాసి.. భార్య ఆగమ్మ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యారు. తన నాలుగెకరాల భూమిలో 2.5 ఎకరాలను కుమారుడు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మిగిలిన భూమి చెరువు శిఖం కింద ఉంది. గతంలో ఇద్దరు కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద 10 గుంటల చొప్పున రాసిచ్చాడు. ఆ భూమిపై కన్నేసిన కుమారుడు తన పేరుపై రాసివ్వాలని ఒత్తిడి తెస్తూ.. తల్లిదండ్రులైన ఇద్దరు వృద్ధులను ఓ చిన్న గదిలో ఉంచి తిండి పెట్టడంలేదు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. తన బాధను గత జులైలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గిఫ్ట్ డీడ్ రద్దు చేసి..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి కుమారుడైన స్వామిరెడ్డికి 6.5 ఎకరాలను గిఫ్ట్ డీడ్ చేశారు. కాగా, వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయాలని గత ఆగస్టులో దరఖాస్తు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి తిరిగి తండ్రి పేరిట భూమిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. తండ్రి పోషణకు ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాలని కుమారుడిని ఆదేశించారు.

అవార్డుల స్ఫూర్తితో అభివృద్ధి




మేయర్ సుధారాణికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీ, నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఇచ్చిన ‘ఎక్సలెన్స్’ ధ్రువపత్రాన్ని సోమవారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు మేయర్‌కు అందజేశారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

యువ పరిశోధకులకు ప్రోత్సాహం



ప్రభాకర్



నరేంద్రకుమార్

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ప్రభుత్వం అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. వివిధ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారి నుంచి 2024 ఆగస్టులో అంతర్జాలం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తి చేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించి పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. తమ ఉత్పత్తిని త్వరలో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వారు వివరించారు.

కాలుష్యపు కోరల్లో.. మంచినీళ్ల చెరువు

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని ‘మంచినీళ్ల చెరువు’ కాకతీయుల కాలం నుంచి గ్రామ ప్రజలకు తాగునీటి వరప్రదాయిని. పంట పొలాలకు సాగునీరు అందించే ప్రధాన జలవనరు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన తాటాకం నేడు కోళ్ల పరిశ్రమ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. సుమారు 115 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 120 మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు చెరువులో నాణెం వేసినా స్పష్టంగా కనపడేదని స్థానికులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం కోళ్ల పరిశ్రమ వెలిసినప్పటి నుంచి మంచినీళ్ల చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోరు బావులు చెరువులోనే ఉండటంతో.. ఈ నీటిని తాగిన వారు జబ్బుల బారిన పడుతున్నారు. స్నానపానాదులకు ఈ నీటిని వాడినా.. చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు ఓ కాలువ ద్వారా అర్ధరాత్రి వ్యర్థాలను చెరువులో వదులుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఉద్యమం ప్రారంభించారు. గ్రామ పరిరక్షణ కమిటీ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు చెబుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పాలనాధికారి డా.సత్యశారదను కలిసి సమస్య విన్నవించారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే రాయపర్తి



రైతు బాలయ్య కుడి చేతి సీసాలో స్వచ్ఛమైన నీరు.. ఎడమచేతిలో కలుషితమైన చెరువు నీరు



వరంగల్ కలెక్టరేట్ ఎదుట రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

మేళతాళాలు.. పూల జల్లుల మధ్య ఉపాధ్యాయులకు వీడ్కోలు



నర్సింహులపేట, న్యూస్‌టుడే: బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మేళతాళాలు మధ్య పూలు చల్లుతూ, కోలాటాలు వేస్తూ ఆనందోత్సాహాల మధ్య వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు నర్సింహులపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు. వారం రోజుల కిందట ఇతర పాఠశాలలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పదకొండేళ్లపాటు తమకు చదువులు చెప్పిన గురువులకు వీడ్కోలు సమావేశంలో పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించి కన్నీరుమున్నీరయ్యారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెమీస్ చేరిన నల్గొండ, మహబూబ్‌నగర్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం కోమటిపల్లి మైదానంలో వరంగల్, నల్గొండ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 16.5 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో నల్గొండ జట్టు 19 ఓవర్లలో 53 పరుగులు చేసి విజయం సాధించింది. నల్గొండ బౌలర్లలో యశ్వంత్ 4 వికెట్లు, శ్రీఖర్ 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్ల మ్యాచ్ జరిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మహబూబ్‌నగర్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అభిలాష్ 66 పరుగులు, అబ్దుల్ 54 పరుగులు చేశారు. తర్వాత బాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మంగళవారం నుంచి పూల్ ‘బి’లోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక

అడ్డంకిగా మారిన పేదరికం



ప్రతిభకు అవయవలోపం, పేదరికం అడ్డుకాదని నిరూపించారు పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి.. అయిదేళ్ల వయసున్నప్పుడే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ప్లాస్టిక్ కాలు సాయంతో నడుస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జేఎన్ స్టేడియంలో జరిగిన పోటీలను చూసి క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పతకాలు సాధించి జాతీయ స్థాయి ఆటలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ విభాగంలో ఎంపికయ్యారు. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ ఆటల్లో పాల్గొనేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, అక్టోబరు 15లోపు రూ.50,000 చెల్లిస్తేనే అర్హత పొందుతానని ఆమె తెలిపారు. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో రూ.లక్ష సమకూర్చడం భారంగా మారింది. దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

వరికి సుడిదోమ ‘పోటు’!





దోమ ఉద్ధృతిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డా.రాజు

న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంటకు సుడిదోమ సోకి తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ సారి 7.50 లక్షల ఎకరాల్లో సాగైనట్లు అంచనా.. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. భారీ వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి పెరిగినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం కీటక శాస్త్రవేత్త డా. రాజు, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె. అనురాధ రైతులకు సూచించారు. ‘పొలాల్లో నీటిపై భాగంలో దోమలు తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్క సుడులుగా ఎండిపోతుంది. పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే గింజరాదు. నూక శాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. పొలాల్లో తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీరు పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉద్ధృతి తగ్గుతుంది. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ట్రైఫ్లుమిజోఫైరిమ్ మందును 94 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి కలిపి వరి మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి. అప్పటికీ నివారణ కాకపోతే లీటరు నీటికి 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి లేదా 0.60 గ్రా పైమెట్రోజిన్ 50 డబ్ల్యూజి లేదా ట్రైఫ్లూమోజోఫైరిమ్ 0.485 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని’ వివరించారు.

రైతేరాజు

ప్రశ్న-సమాధానం

? మిరప పంటలో తామర పురుగుల నివారణ చర్యలు తెలపండి..? -వి.బుచ్చిరెడ్డి. దేవన్నపేట

✔ తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో పైకి ముడుచుకుంటాయి. దీన్ని నివారించడానికి నాటిన 15, 45, రోజులకు ఎకరాకు 8 కిలోల ఫిప్రోనికల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. అవసరాన్ని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. డైమిథియేట్ 2 మి.లీ. లేదా క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

-తిరుపతి, ఉద్యానశాఖ అధికారి, వరంగల్



తామర పురుగులు ఆశించడంతో ముడుచుకుపోయిన మిరప మొక్కలు

–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

మకోసం

ఉల్లిసాగుకు సమయమిదే...

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే : ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరగడంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. లాభాలు గడించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజు తెలిపారు. ‘వర్షాకాలంలో నవంబర్‌లోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లి సాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120 సెం.మీ వెడల్పు, 3 మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200 చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి చేయాలి. మూడు గ్రాముల కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5 గ్రా. లీటరు నీటికి ద్రావణాన్ని చల్లడం వల్ల మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారునాటిన వంద రోజులకు కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 80 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి, మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో నాలుగు, అయిదు తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో ఏడు రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని’ వివరించారు.



డా.రాజు.శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు.



దేవన్నపేటలో సాగుచేసిన ఉల్లి

గులాబీ.. లాభాల గుబాళింపు





చక్రధర్‌రావు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : మెట్ట ప్రాంతంలో గులాబీ తోట సాగుచేసి కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ లాభాలు పొందుతున్నారు. మండలంలోనే గులాబీ తోట సాగు చేసి ఆదర్శంగా నిలిచారు.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్లపల్లి గ్రామానికి చెందిన రైతు తూముల చక్రధర్‌రావు సుమారు పదేళ్ల కిందట హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో వ్యవసాయం చేస్తున్నాడు. ఎకరంలో వరి, పత్తి సాగు చేశాడు. మిగతా ఎకరంలో సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడాది క్రితం గులాబీ తోట సాగు చేశారు. నెల నుంచి పువ్వులు దిగుబడి తీస్తున్నారు. వారంలో రెండు సార్లు కోసి విక్రయిస్తున్నారు. చెట్లకు మూడు రోజులకోసారి 40 నుంచి 50 కిలోల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. తోట వద్దకు వచ్చేవారికి రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. రైతు చక్రధర్ మాట్లాడుతూ... నెల రోజులుగా పూలు పూస్తున్నాయి. పండగల వేళల్లో ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు సస్యరక్షణ చేపడుతున్నాం.. మొక్కలకు దిగుబడి అనంతరం కొమ్మల కత్తిరింపు చేపడుతూ.. పదేళ్ల వరకు పూల దిగుబడి పొందవచ్చని వివరించారు.

సమస్యలు విని.. పరిష్కారానికి ఆదేశించి!

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: పదే పదే ప్రజావాణికి వచ్చినా తమకు న్యాయం జరగడం లేదని, తహసీల్దార్ కార్యాలయాల్లో సకాలంలో అధికారులు స్పందించడం లేదని, ఇటీవల వైద్యశాఖలో భర్తీ చేసిన వివిధ పోస్టులలో తప్పులు దొర్లాయని, ఇలాంటి అనేక సమస్యలు ప్రజావాణిలో వెల్లువెత్తాయి. కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న ప్రజల అర్జీలను స్వీకరించారు. పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. మొత్తం 47 అర్జీలు వచ్చాయి.


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్

భూమి పట్టా చేయాలంటూ..

తన కోడలు, మనవడి సాయంతో ప్రజావాణికి వచ్చిన ఈ వృద్ధుడి పేరు గాదె కిరీటిరెడ్డి. దేవరుప్పుల మండలం రామచంద్రాపురంలోని సర్వే నెంబర్ 221/బి, 353/సి, 355/బి సర్వే నెంబర్లలోని నమోదు కానీ భూమిని కొత్త పాసుపుస్తకంలో నమోదు చేయాలని కోరుతూ గతంలో ప్రజావాణిలో అర్జీ అందజేశారు. పరిశీలించిన కలెక్టర్ స్థానిక తహసీల్దార్‌కు బదిలీ చేశారు. అప్పటి నుంచి స్పందన కరవవడంతో మళ్లీ ప్రజావాణిని ఆశ్రయించి, అదనపు కలెక్టర్‌కు విన్నవించగా ఆయన తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



శాఖల వారీగా అర్జీలు..	
ఆర్డీవోల పరిధిలోనివి	9
తహసీల్దార్లు..	23
ఇతర శాఖలు	15

కందకం తీసి ఇబ్బందులు పెడుతున్నారని..

వీరు జనగామ మండలంలోని పెద్దరామన్చర్లకు చెందిన రైతులు. వందేళ్ల నుంచి తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారిని మరి కొంత మంది రైతులు తమను వెళ్లనివ్వకుండా అదే దారిలో కందకం తీసి, ముళ్లకంచెలు వేసి ఇబ్బందులు పెడుతున్నారని ప్రజావాణిలో పాలనాధికారికి ఫిర్యాదు చేశారు. దాడులకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని, అదేవిధంగా బావుల వద్దకు వెళ్లేలా దారి చూపించి, న్యాయం చేయాలని కోరారు.



మరికొన్ని సమస్యలు..

ఎంసీహెచ్ ఆసుపత్రిలో రక్త కణాలను పరీక్ష చేసే యంత్రాన్ని, ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కానింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని 30వ వార్డు కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ విన్నవించారు. * జిల్లాలోని ప్రైవేట్ కళాశాలు, పాఠశాలల్లో హాస్టళ్ల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, ఆయా హాస్టళ్లలోని ఆహార నాణ్యతను ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించడం లేదని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ☛ జనగామ జిల్లా కేంద్రంలోని గణేశ్‌వాడకు చెందిన కె.శ్రీనివాసరావు మురుగుకాల్వల నిర్మాణాన్ని నాణ్యతతో చేపట్టాలని కోరారు. ☛ లింగాలఘనపురం మండలం జీడికల్లుకు చెందిన కె.మాధవి ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థికసాయం కోసం అర్జీ పెట్టారు. ☛ తమ సమస్యలు విన్నవించేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. గుక్కెడు మంచి నీళ్లు అయినా ఏర్పాటు చేయడం లేదని పలువురు వాపోతున్నారు.

అదనపు ప్రతిపాదనలపై కౌన్సిలర్ల ఆగ్రహం


సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

జనగామ, న్యూస్‌టుడే: పురపాలిక సర్వసభ్య సమావేశం నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అప్పటికప్పుడు ప్రస్తావనలను, అదనపు ఎజెండా అంశాలను చేర్చడంపై కౌన్సిల్ సభ్యులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున అధ్యక్షతన జనగామ పురపాలిక సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. 16వ వార్డు సభ్యుడు గాదెపాక రాంచందర్ పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, సంజయ్‌నగర్లో రాత్రివేళ గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయన్నారు. వీధి కుక్కల నియంత్రణకు రూ.10 లక్షలు కేటాయించగా, ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా ఫ్లోర్‌లీడర్ హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో లోకల్ బస్ సౌకర్యం కల్పించాలన్నారు. భగీరథ పనుల్లో తవ్వకాలను పూడ్చాలని, టెండర్లయిన పనులను చేపట్టాలని కోరారు. ఎజెండాలో లేని అంశాలను టేబుల్ అంశాలు పేరిట ఇబ్బడి ముబ్బడిగా సమావేశ సమయంలో చేర్చడంపై సభ్యులు పేర్ని స్వరూప, శ్రీ శ్రీనివాస్ తదితరులు వివరణ కోరారు. 12వ వార్డులో కల్వర్టు అనుసంధాన దారి పనుల గురించి కౌన్సిలర్ భూలక్ష్మి, మూడో వార్డు పరిశుభ్రత ఇబ్బందిని జిల్లా కలెక్టరేట్‌కు పంపించిన వలన తమ వార్డుల్లో పనులు జరగడం లేదని కౌన్సిలర్ పగిడిపాటి సుధ, 25వార్డులో తాగునీరు, చెత్త తరలింపు సమస్యలను ఉడుగుల శ్రీలత ప్రస్తావించారు. ప్రధాన ఎజెండాలోని 24 అంశాలతో పాటు, అప్పటికప్పుడు ప్రవేశపెట్టిన 17 అంశాలపై తూతూ మంత్రంగా చర్చించి ఒక్క అంశాన్ని వాయిదా వేశారు. సభ్యుల ప్రశ్నలకు ఛైర్‌పర్సన్ జమున, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంఈ మహిపాల్ వివరణ ఇచ్చారు. సమావేశంలో వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

కొడకండ్ల: కొడకండ్ల బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మను అందంగా ముస్తాబు చేసి, ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
[illegible]: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

జనగామ, న్యూస్‌టుడే: గుండ్లగడ్డ పాత క్రిష్టబావి కూడిన్న ప్రాంతానికి పక్కనే మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతివనం అధ్వానంగా మారింది. కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. - స్థానికులు

సమాధానం: వనాన్ని పరిశీలించి, వినియోగంలోకి తీసుకువచ్చేలా తగు చర్యలు తీసుకుంటాం. -మహిపాల్, ఎంఈ

సమాధానం: స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన, రజక వీధిలోకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి కల్వర్టు కుంగి ప్రమాదకరంగా మారింది. గుంతను తప్పించేందుకు రాంగ్‌రూట్లో వెళ్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - రజక సంక్షేమ సంఘం ప్రతినిధులు

సమాధానం: కుంగిన కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - మహిపాల్, ఎంఈ

పాలకుర్తి: మండలంలోని వావిలాలలో పలు వీధుల్లో స్తంభాలకు దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందిగా మారింది. - రాజు, గ్రామస్థుడు

సమాధానం: సిబ్బందితో దీపాలు ఏర్పాటు చేయిస్తా. - అనిల్, పంచాయతీ కార్యదర్శి

రహదారిపై ఎండిన చెట్టు తొలగింపు

స్పందనకు వందనం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని శివునిపల్లి రెండో వార్డులో ఎండిన మోడు రహదారి పైకి ఉండడంతో బాటసారులు, కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురించగా జిల్లా పంచాయతీ అధికారిని స్వరూప స్పందించి సిబ్బందితో తొలగించారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు, చిత్రంలో మార్తినేని ధర్మారావు, దశమంతరెడ్డి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవ పక్షం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాణాపురంలో సోమవారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాజపా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మార్తినేని ధర్మారావు హాజరయ్యారు. కాలనీలోని ప్రజలకు వైద్యుల సమక్షంలో వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, నాయకులు ఉడుగుల రమేశ్, సౌడ రమేశ్, శివరాజ్, నారాయణ, ఎల్లయ్య, నరసింహారెడ్డి, కార్తీక్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

'నాస్' పరీక్షకు సన్నద్ధం చేయండి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) బృందం త్వరలో జిల్లాలో పర్యటించనున్నందున విద్యార్థులను ఆ పరీక్షను ఎదుర్కొనేలా సన్నద్ధం చేయాలని ఎస్సీఈఆర్టీ పర్యవేక్షకులు డా.మన్మోహన్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, డిజిటల్ తరగతుల పనితీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నందున మెరుగుపరచుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎ.నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకంతో ఆర్థిక స్వావలంబన

జనగామ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిర మహిళ శక్తి పథకం, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ పి.పింకేశ్‌కుమార్ అన్నారు. జనగామ మున్సిపల్ పరిధిలో మెప్మా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి మహిళా వ్యాపార సేవా దుకాణ సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సమష్టి భాగస్వామ్యంతో ప్రారంభించిన వ్యాపారాలతో ఆర్థిక ప్రగతిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ హర్షవర్ధన్, జిల్లా సమన్వయకర్త రమేశ్‌నాయక్, సహ సమన్వయకర్త వాణిశ్రీ, పట్టణ కోఆర్డినేటర్ రాజేందర్, సీవోలు షాహిన్ సుల్తాన, తిరుమల, మెప్మా రేణుక, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు శాశ్వత గుర్తింపు



జనగామ, న్యూస్‌టుడే: ఉద్యోగ విధులను సక్రమంగా నిర్వర్తించే వారిని, బాధ్యతగా సేవలందించే ప్రభుత్వ ఉద్యోగి ఏ స్థాయివారైనా వారికి శాశ్వత గుర్తింపు ఉంటుందని స్థానిక ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.పావని కుమారి అన్నారు. కళాశాలలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తూ, 32 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ చేసిన గుజ్జు వెంకటస్వామి వీడ్కోలు సత్కార కార్యక్రమం సోమవారం జరిగింది. అదే కళాశాలలో చదువుకుని, అక్కడే పదవీ విరమణ చేయడం అరుదుగా ఉంటుందన్నారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉమ్మడి వరగంల్ జిల్లాల్లోని నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఉమెన్స్ టైలర్, బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్ ఉచిత శిక్షణకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బాస రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి తెలుగు చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. రేషన్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. విద్యార్హత ధ్రువపత్రాలు జిరాక్స్‌తో అక్టోబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704056522, 9849307873, 9949108934, 6281260878 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని వినతి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో మాట్లాడుతున్న నగేశ్

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్‌లోని ప్రాచీన కట్టడాలు, పడమర కొండపై కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించినట్లు భాజపా మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

బతుకమ్మ పండగకు పకడ్బందీ ఏర్పాట్లు


జలాశయం కట్టవద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. డివిజన్ కేంద్రంలో సోమవారం బతుకమ్మ ఆడే ప్రదేశాన్ని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బతుకమ్మ విగ్రహానికి రంగులు వేయించి, ధ్వంసమైన చోట గ్రానైట్ రాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టాలని ఏసీపీ ఆర్.భీమ్‌శర్మకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, సీఐ వేణు, ఈవో లింగయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం

చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కుసుమ శ్రీవల్లి ఇంజనీరింగ్ చదవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతోంది. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం శ్రీవల్లికి ఫీజు నిమిత్తం రూ.35వేలను కడియం ఫౌండేషన్ ద్వారా అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని ఛాగల్లులో ఇటీవల జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నిర్వహించారు. జఫర్‌గఢ్ ఆదర్శ పాఠశాలలోని నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, శ్రీనాథ్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం


కుర్చపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: పాలక వర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను చేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మహ్మద్ అబ్బాస్ అన్నారు. మండలంలోని కుర్చపల్లిలో సోమవారం ఆ పార్టీ గ్రామ సభను నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలక వర్గాల వైఫల్యంతో నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలి చావులు పెరిగినట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ కమిటీ ఎన్నికను నిర్వహించగా మూడోసారి కూడా కాసని పుల్లయ్య ఎన్నికయ్యారని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు, సభ్యులు గోపి, నాగరాజు, మండల కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాదారుడిపై కేసు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మండలంలోని నిడిగొండకు చెందిన ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.నరేశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన కానుకుంట్ల లక్ష్మణ్ స్థానిక వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

క్రీడా దుస్తుల వితరణ


క్రీడాకారులైన విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: కుందారం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయిని కె.క్రిష్ణవేణి రూ.35 వేలతో సమకూర్చిన క్రీడా దుస్తులను ఎంఈవో పడాల విష్ణుమూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిట్ల రవిశంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపీపీ ఛైర్‌పర్సన్ సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, రజిత, రమాదేవి, రాములు, సుధారాణి పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: చెట్టుకు ఉరి వేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకొంది. సీఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శివునిపల్లిలో పాలకుర్తి రహదారి పక్కన రైల్వే స్టేషన్ సమీపంలో 50 ఏళ్ల వయసు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మధ్యాహ్నం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సృజనాత్మకతకు పుస్తక పఠనం దోహదం

లింగాలఘనపురం: పుస్తక పఠనంతో జ్ఞానం, ఆలోచన శక్తి, పరిశీలనాత్మక దృష్టి, సృజనాత్మకత పెంపొందుతాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సునీత, తెలుగు ఉపాధ్యాయులు సుధాకర్ అన్నారు. కాంతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందుకూరి రాము పాఠశాల గ్రంథాలయానికి పంపిన పుస్తకాలు, పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు తెలిపే ప్రేరణాత్మక, స్ఫూర్తిదాయక పోస్టర్లను సోమవారం పాఠశాలలో ప్రదర్శించారు. సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా పుస్తక పఠనం చేయాలని విద్యార్థులకు సూచించారు.

ప్రతిభ చాటిన నరేష్



దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో దేవరుప్పులకు చెందిన కారుపోతుల నరేష్ సత్తాచాటాడు. పీఈటీ, పీడీ రెండు విభాగాల్లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించాడు. అంతేకాకుండా ఇటీవల ప్రకటించిన టీజీ గురుకుల పాఠశాలలో పీజీటీగా ఎంపికై నియామక పత్రం కోసం వేచిచూస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, మనోధైర్యంతోనే మూడు ఉద్యోగాలు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

సంధ్యకు అభినందనలు



దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: మండల వనరుల కేంద్రంలో ఒప్పంద పద్ధతిలో ఐఈఆర్పీ బోధకురాలుగా పని చేస్తున్న సంధ్య సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ రెండు విభాగాలల్లో జిల్లా ప్రథమ స్థానం పొందడం సంతోషంగా ఉందని ఎంఈవో కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఆమె పాఠాలు బోధిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులతో క్లబ్స్ ఏర్పాటు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు విద్యార్థులతో పలు విభాగాలకు సంబంధించిన క్లబ్స్ ఏర్పాటు చేసినట్లు పెంబర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి వెల్లడించారు. సోమవారం బడిలో పలు విభాగాల క్లబ్స్‌ను ఎన్నికల రూపంలో నిర్వహించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మృణాళిని, శ్రీనివాసులు, విజయ, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

తరిగొప్పుల: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వాచ్యతండా పరిధిలోని నాన్య నాయక్‌తండాకు చెందిన భూక్య హీర్యా తన సొంత పనుల నిమిత్తం నర్మెట్టకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తరిగొప్పుల వద్ద ఓ కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సకాలంలో ఘటనాస్థలికి చేరుకోవాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ప్రమాద సంఘటనపై కాల్ వచ్చిన వెంటనే ఘటనాస్థలికి చేరుకొని ప్రథమ చికిత్స చేస్తూ దగ్గరలోని ఆసుపత్రికి చేర్చి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ సూచించారు. సోమవారం జిల్లా ఏరియా ఆసుపత్రిలోని 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108, 102 రికార్డులను క్షుణ్నంగా పరిశీలించారు. వాహనాల పనితీరును, అంబులెన్స్‌లోని పరికరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో ఈఎంటీ ప్రశాంత్, పైలట్ గోపిచంద్ పాల్గొన్నారు.

నేత కార్మికులను ఆదుకోవాలని వినతి

రఘునాథపల్లి: వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నేత కార్మికులు జనగామ జిల్లాలో అత్యధికంగా ఉన్నందున వారిని అన్ని విధాలా ఆదుకోవాలని పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాపోలు రామ్మూర్తి సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. నేత కార్మికుల సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు.

వంటకు కాదు.. ప్రచారానికే..



చూడగానే బాబోయ్ ఎంత పెద్ద గ్యాస్ సిలిండర్ అన్నట్లుంది కదూ.. కానీ ఇది ప్లాస్టిక్‌తో తయారు చేసిన మాదిరి సిలిండర్. జనగామ జిల్లా సచివాలయంలో కొలువుదీరింది. మహాలక్ష్మి పథకంలో రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేసే కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ప్రచారం కోసం దీనిని కలెక్టరేట్లో ఏర్పాటు చేశారు. భవనంపైన ఈ పథకానికి సంబంధించిన విశేషాలతో బెలూన్‌ను ఎగురవేశారు. పనిమీద వచ్చే వారిని ఆకట్టుకుంటోంది. – జనగామ, న్యూస్‌టుడే

సిటింగ్ జడ్జితో విచారణకు డిమాండ్



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం జనగామ కలెక్టరేట్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం వైదొలగాలని, పూజ్య పీఠాధిపతులు, ఆధ్యాత్మిక, సామాజిక వేత్తలతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసి దేవాలయ వ్యవస్థను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పగిడిపాటి నరహరి, రంగా నర్సింగరావు, ముక్క స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్ల దందా?

జనగామ, న్యూస్‌టుడే: జనగామ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో వసూళ్ల దందా పెచ్చరిల్లిందని బాధితులు వాపోతున్నారు. అధికారుల వాటా అధికారులు వసూలు చేస్తున్నారని, కింది స్థాయి ఉద్యోగులు తమ వాటా తమకు ఇవ్వాల్సిందేనని దబాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుబంధ పత్రాలు అన్ని సక్రమంగా ఉన్నా తిరకాసులు పెడుతున్నారని సమాచారం. ఒక జూనియర్ అసిస్టెంట్ వసూళ్ల విషయంలో బెదిరింపులకు సైతం వెనుకాడటం లేదని తెలుస్తోంది. సోమవారం సబ్‌రిజిస్ట్రార్ రాకపోవడంతో ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఇతరులు ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారని తమ పేరు చెప్పడానికి ఇష్టపడని పలువురు ఇబ్బందులను వివరించారు. ఈ విషయమై శాఖ ఉన్నతాధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

ప్రజలపై పన్నులు మోపడం సరికాదు



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన భాజపా దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి, ప్రజలపై పన్నుల భారం వేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నరామన్చర్లలో పార్టీ జెండావిష్కరణ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపా కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సీపీఎం బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్, సభ్యులు ఎల్లయ్య, అశోక్, అయిలయ్య, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో 'హైడ్రా' ఏర్పాటు చేయాలి



పాలకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతి గ్రామంలో 'హైడ్రా' తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి, కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను రక్షించాలని సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా డిమాండ్ చేశారు. సోమవారం పాలకుర్తిలో పార్టీ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల భూముల జోలికి పోవడం సరికాదని, వారికి ప్రత్యామ్నాయం చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, జీడీ సోమయ్య, కళింగరాజు, పోలాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన



నర్మెట్ట, న్యూస్‌టుడే: ప్రజలు మూఢనమ్మకాలను, అపోహలను నమ్మిమోసపోవద్దని ఎస్సై నగేష్ అన్నారు. మండలంలోని వెల్దండలో సోమవారం సాయంత్రం పోలీస్ జాగృతి కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, డయల్ 100, డయల్ 1930, గంజాయ్, గుట్కా, సీసీ కెమెరా, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై నాటకాలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాబృదందం సభ్యులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని శిక్షించాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికను అత్యాచారం చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని జనగామ జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితురాలి కుటుంబానికి తాము అండగా నిలుస్తామన్నారు. సంఘం నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, చంద్రం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

